క్లుప్తంగా

అవకతవకలకు పాల్పడితే చర్యలు



బంద్రేపల్లి ఎఫ్‌పీ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

రొళ్ల: రేషన్ షాపుల డీలర్లు వినియోగదారులకు నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ షెక్షావలి డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.రాయాపురం, మల్లినమడుగు తదితర పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎఫ్‌పీ షాపులను తనిఖీ చేశారు.

నీటి సమస్యకు చెక్



15వ వార్డులో బోరు వేయిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 15వ వార్డులోని సీపీఐ కాలనీ, హమాలీ కాలనీ, ఐషా మసీదు, ఉమర్ మసీద్ ప్రాంతాల్లో కొద్ది రోజులుగా నీటి ఎద్దడితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక స్థానిక వార్డు కౌన్సిలర్ షాజియాకు నీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు కౌన్సిలర్ షాజియా, సీనియర్ నాయకుడు డాక్టర్ బాషా, ఫజలూర్ మిత్రబృందం కలిసి సొంత నిధులు వెచ్చించి రెండు నూతన బోర్లను వేయించారు. నీరు కూడా పుష్కలంగా పడటంతో ఆయా కాలనీల్లో నీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ దాతలకు, సమన్వయకర్త దీపికకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లీలు నయాజ్ కుమార్, అంజద్ బాషా, మసీదు కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

7 వరకూ యోగాంధ్ర పోటీలు

పెనుకొండ: యోగాంధ్ర పోటీలను ఈ నెల 3 నుంచి 7 వరకూ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. 4న జూనియర్, సీనియర్లకు యోగా, యోగా పాటలు, పెయింటింగ్, 6న జూనియర్, యంగ్ సీనియర్లకు యోగా, వ్యాసరచన, యోగా క్విజ్, యోగా స్లోగన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు శాంతినికేతన్ స్కూల్ పోటీలు ఉంటాయన్నారు. బాలబాలికలు, స్త్రీ, పురుషులకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 08555-221116కు ఫోన్ చేయాలన్నారు. ఇదిలా ఉండగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శాంతినికేతన్ స్కూల్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పట్టణ వాసులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు



భద్రపర్చిన నేత్రాలను తీసుకెళ్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని రోటరీ సంస్థ సభ్యులు నేత్ర దానంపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాదు సభ్యులు పాటిస్తున్నారు. రోటరీ కార్యదర్శి శ్రీనివాసులు తన తండ్రి వరప్రసాద్ మరణానంతరం ఆయన రెండు నేత్రలను మంగళవారం దానంగా అందించారు. బెంగళూరు రాజ్‌కుమార్ ఐ ఫౌండేషన్ సహకారంతో నేత్రదానం చేయడంతో ఫౌండేషన్ సభ్యులు తరలివచ్చి మృతుని నేత్రాలను సేకరించి బెంగళూరు డాక్టర్ రాజ్ కుమార్ నేత్రదాన కేంద్రానికి తరలించారు.

అభివృద్ధి పనులపై సమీక్షకు మంత్రి వర్గీయుల డుమ్మా

పెనుకొండ: నియోజకవర్గంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే. పార్థసారధి అధికారుల, నాయకులు, కార్యకర్తలు, సమీక్ష నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో ఆయన ఏఏ మండలంలో ఏఏ పనులు చేపట్టాలి అన్న దానిపై అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే సమావేశానికి మంత్రి సవిత వర్గీయులు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

హిందూపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్రపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వ్యాస రచన పోటీల్లో గగన్ సాయి మొదటి స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపీడీఓ సరస్వతీ బహుమతులను అందించారు.

నమ్మించి.. నట్టేట ముంచి..



కరోన సమయంలో బాధితుల ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసరాలు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ప్రతి ఇంటికి నవరత్నాల్లాంటి పథకాలను చేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచింది. అందులో భాగంగానే ప్రజలు, ప్రభుత్వానికి వారధిలా నిలిచేలా వలంటీర్ల సేవలు గడప గడపకూ అందాయి. ఈ సేవా బలగం కూటమి నాయకుల మోసానికి బలైంది. చివరకు ప్రజలకు దూరమైంది.

- వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని కూటమి నాయకుల హామీలు
- వ్యవస్థ నిర్వీర్యంతో రోడ్డుపైకి వేలాది మంది వలంటీర్లు
- కూటమి నాయకులు నమ్మించి మోసం చేశారని ఆవేదన
- నేటికీ సేవలను గుర్తుచేసుకుంటున్న ప్రజలు

హిందూపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా 20,053 మంది వలంటీర్లు దాదాపు ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కీలకపాత్ర పోషించారు. అయితే గత ఎన్నికల సమయంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, మరో రూ.5 వేలు పెంచి నెలకు వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని కూటమి నేతలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా



లబ్ధిదారుల వద్దకే వెళ్లి ఫించన్‌ను అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

కూటమి ప్రభుత్వం వలంటీర్ల బాధలను పట్టించుకోకపోగా, ఏకంగా వ్యవస్థను నిర్వీర్యం చేసేసింది.

ఇబ్బందుల్లో ప్రజలు

వలంటీర్లు లేకపోవడంతో ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అందించిన సేవలను ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. ప్రతి నెల 1వ తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి ఠంచనుగా పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లు ఎనలేని సేవలందించారు. తమకు కేటాయించిన 50 ఇళ్లలో ఆయా పథకాలకు అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయించేవారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లుగా కొనసాగించకుండా వారిని మోసం చేశారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి



ఐదేళ్ల పాటు వలంటీర్‌గా పనిచేసి నాకు కేటాయించిన కుటుంబాలకు విశిష్ట సేవలందించాను. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారులకు ఫించన్లు అందజేశాను. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నవరత్న పథకాల వర్తింపులో మా వంతు కృషి చేశాము. కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– యుగంధర్, వలంటీర్

కరోనాను దీటుగా ఎదుర్కొన్నాం



కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించాం. వైరస్ బారిన పడిన వ్యక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి వైద్యసేవలందేలా కృషి చేశాము. ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపులో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేశాం. వలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వ వలంటీర్ వ్యవస్థను తిరిగి అమలు చేయాలి.

– వేణు, వలంటీర్

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



గతంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా గతంలో ఇంటి వద్దకే అన్ని రకాల సేవలందేవి. సంక్షేమ పథకాలు, వివిధ ధ్రువపత్రాలను వలంటీర్లు ఇళ్ల వద్దకే తీసుకొచ్చేవారు. ఏడాది నుంచి వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో సేవలు అందటం లేదు. ప్రభుత్వం నుంచి ఏ చిన్నపని కావాలన్నా అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇందు కోసం వ్యయ, ప్రయాసలు ఎదుర్కొవాల్సి వస్తోంది.

– రామాంజి, హిందూపురం

‘కూటమి’ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మడకశిరలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు మడకశిర పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకోవాలని సూచించారు. మంగళవారం టీడీ పల్లిలో వైఎస్సార్‌సీపీ వివిధ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి 'వెన్నుపోటు దినం' విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా సీఎం చంద్రబాబు వంచించారని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా ఇంకెనాళ్లు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వం మెడలు వంచడానికే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, వివిధ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నిరసనను విజయవంతం చేయండి

చిలమత్తూరు: ప్రజా వంచక ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిందని, ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు బుధవారం హిందూపురం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించాలని పిలుపునిచ్చారు.

మడకశిర: మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు నిరసన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో కోరారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఉదయ 9 గంటలకే మడకశిర పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్దకు చేరుకోవాలన్నారు. వైఎస్సార్ సర్కిల్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.

అమరాపురం: మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే బుధవారం ఉదయం నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నటరాజు, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, శివకుమార్ పిలుపునిచ్చారు. అమరాపురం మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

రొళ్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు మడకశిరలో బుధవారం సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో చేపట్టనున్న 'వెన్నుపోటు' నిరసన ర్యాలీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలు నేరవేర్చకుండా ప్రజలను మోసగించిందని విమర్శించారు. వెన్నుపోటు నిరసన ర్యాలీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

భూవివాదానికి పరిష్కారం



కె.శివరంలో భూమిని సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం: మండల పరిధిలోని కె.శివరం గ్రామానికి చెందిన భూమిని మంగళవారం సర్వే చేసి హద్దులు నిర్ణయించి సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. 'సరిహద్దులో గెలిచినా ఊళ్లో ఓడిపోతున్నా' అన్న శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగానే సోమవారం తహసీల్దార్ లక్ష్మీనరసింహ, కార్యాలయం సిబ్బంది, మడకశిర సీఐ రాజ్‌కుమార్, అమరాపురం ఎస్ఐ ఇషాక్‌బాషా సిబ్బంది బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి మామ కదురప్పకు చెందిన 366-7, 8, 9 సర్వే నంబర్లలో ఉన్న 2.09 ఎకరాల భూమిని సర్వే చేయించారు. భూమి హద్దులను నిర్ణయించి భూ సమస్యను పరిష్కరించారు. గతంలో ఎన్నిసార్లు రెవెన్యూ, పోలీసుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో భూ సమస్యను నేటికి పరిష్కరించారని, ఇందుకు సహకరించిన వారికి భూ యాజమాని కదురప్ప కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: పురపాలక సంఘంలోని పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ కార్మికులు మృతి చెందితే వారికి న్యాయంగా చెల్లించాల్సిన బెనిఫిట్స్ చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్‌తో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే 220 మంది పారిశుధ్య కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ నిధుల నుంచి రూ.4.94 లక్షలు కొందరు సొంత ఖాతాలకు జమ చేసుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేసి, దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మారుతీరెడ్డి, చలపతి, ముత్యాలప్ప, సిద్ధగిరి సురేష్, ఇస్మాయిల్, ఈరప్ప, బాలాజీ, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర రూరల్: సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుండుమల గొల్లహట్టి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం, గర్భిణులకు సీమంతాలు, పౌష్టికాహారం, బాల్యవివాహాలపై సెక్టర్ స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రొళ్ల: మండల పరిధిలోని కాకి అంగన్వాడీ సెంటర్లలో మంగళవారం మధ్యాహ్నం ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై యుక్త వయస్సు గల బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ అరుణ, అంగన్వాడీ వర్కర్లు, కిశోరి బాలికలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విషయాలపై అవగాహన కల్పించారు.

పాఠశాలలో నాగుపాము కలకలం



గేటు వద్ద ఉన్న పాము

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాగుపాము కలకలం రేపింది. మండలంలోని పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేయడానికి స్థానిక పాఠశాలలో విద్యాశాఖ అధికారులు స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పుస్తకాలు సర్దుకుంటున్న సమయంలో పాము గదిలో కనిపించింది. దీంతో వారు బయటకు పరుగులు తీశారు. అనంతరం మధ్యాహ్నం భోజన ఏజెన్సీ నిర్వాహకుడు మూర్తి అక్కడికి చేరుకొని కట్టె సహాయంతో పామును బయటకు పంపించి వేశారు.

వలస కూలీల ‘వ్యథ’

- చదువులకు దూరమై మగ్గిపోతున్న కూలీల బిడ్డలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలమత్తూరు: ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం ఉందని ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నాం. అయితే ఇంత పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన మన దేశంలో ఎంతో మంది చిన్నారులు విద్యకు దూరమై వారు కూడా కూలీలుగా మారుతూ పేదరికాన్నే అనుభవించాల్సిన దుస్థితి నెలకొంది. పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీల బతుకులు, వారి బిడ్డల జీవితాలు ప్రశ్నార్థకంలో ఉన్నాయి. హిందూపురం రూరల్ మండలం గొల్లాపురం పారిశ్రామికవాడకు వందలాది మంది కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. అయితే వలస కూలీల పిల్లలకు విద్య, వైద్యం కూడా అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ బిడ్డలకు చదువు చెప్పించండంటూ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేకపోయారు. పారిశ్రామికవాడలో సుమారు 200 మంది చిన్నారులు



చదువులు లేకపోవడంతో ఫ్యాక్టరీల వద్దనే మగ్గుతున్న వలస కూలీల బిడ్డలు

విద్య లేక మాసిపోయిన బట్టలతో ప్రపంచానికి దూరంగా జీవిస్తుండటం బాధాకరం. గత ఎన్నికల ముందు స్థానిక కూటమి పాలకులు వలస కార్మికుల బిడ్డలకు విద్య, వైద్యం అందేలా చేస్తామని హామీలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చాక మాత్రం వారిని ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనికి తోడు జిల్లాలో ఉన్నతాధికారులందరూ నిత్యం హిందూపురం వచ్చి వెళ్తున్న వలస కార్మికుల వ్యథ వారికి కనిపించడం లేదా? ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు వెంటనే పూర్తి చేయండి

మడకశిర: పట్టణంలోని పాత ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజా సంఘాల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రతినిధి కన్యాకుమారి, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు తదితరులు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పాత ఎస్సీ కాలనీ వద్ద మోరీ పనులను పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. డ్రైనేజీ పనులు పూర్తి కాకుండా పోవడంతో పాత ఎస్సీ కాలనీకి సరైన దారి లేకుండా పోయిందన్నారు. మోరీ పనులు పూర్తి కాకపోవడంతో చెత్తా చెదారం పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి గ్రామంలోని రేషన్ షాపును మంగళవారం సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో ఉండే రికార్డులను పరిశీలించారు. తూకం వేసే యంత్రాన్ని నిశితంగా పరిశీలించి, తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఎంఎస్ రాజు నోరు అదుపులో పెట్టుకో

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హెచ్చరిక



మడకశిరరూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధి కట్టారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారముందని మడకశిర ఎమ్మెల్యే ఎం ఎస్.రాజు నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. తెనాలిలో దళిత యువకులపైన పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శకుం వెళ్తున్నాడని గుర్తించి ముందు రోజు మడకశిర ఎమ్మెల్యే వైఎస్ జగన్‌పై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమాలు భూ కబ్జాలు ఎవరు చేస్తున్నారో ఇప్పటికే జిల్లా ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. నెలకు రెండు మూడు సార్లు మడకశిరలో పర్యటించి వెళుతున్నారే తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో పది శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకొని మడకశిర ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటికే రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని, ఇది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. తెనాలిలో దళిత యువకులపై గంజాయి కేసులు ఉంటే పోలీసులు డాక్టర్ సర్టిఫికెట్లను ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు.

మలేరియా నివారణపై అవగాహన

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమావేశంతో పాటు మలేరియా నివారణ మాసోత్సవంపై మంగళవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. వర్షాల కాలం ప్రారంభం కావడంతో మలేరియా నివారణకు అవసరమైన సూచనలను చేశారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు.

కబడ్డీ విజేత ‘గుబ్బి’



ట్రోఫీతో గుబ్బి జట్టు సభ్యులు

పావగడ: స్థానిక కురుబరహళ్లి గేట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన తుమకూరు విశ్వవిద్యాలయం అంతర్ డిగ్రీ కళాశాల మహిళల కబడ్డీ పోటీల్లో గుబ్బి ప్రభుత్వ మహిళా కళాశాల జట్టు విజేతగా నిలిచింది. కుణిగల్ ప్రభుత్వ మహిళా కళాశాల రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు. రెండు జట్ల సభ్యులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో పావగడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పీ శివానందయ్య, తాజా మాజీ ప్రిన్సిపాల్ కేటీ మారెప్ప, తుమకూరు విశ్వవిద్యాలయం డైరెక్టర్ సుదీప్‌కుమార్, సీడీఎంసీ మెంబర్ మారుతీప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.